
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
శుక్రవారం 23 మే 2025



ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియ వేగంగా పూర్తిచేయాలి

సిద్దిపేట కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియ వేగంగా పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులను మాత్రమే ఎంపిక చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకాలపై గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా, మండల అధికారులతో అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్‌తో కలిసి ఆయన సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు



నకాశీ.. సూపర్బ్

- చేర్యాల పెయింటిగ్స్‌కు ప్రపంచ సుందరీమణులు ఫిదా
- మాస్కులు తయారు చేసి..


కళాకారులను అభినందించి అందగత్తెలు



"వావ్.. వాట్ ఏ వండర్‌ఫుల్ ఆర్ట్.. సూపర్బ్ మాస్క్స్, ఎక్సలెంట్ పెయింటిగ్స్" అంటూ చేర్యాల నకాశీ చిత్రకళలకు ప్రపంచ అందగత్తెలు కితాబునిచ్చారు. అంతర్జాతీయ ఖ్యాతిగడించిన చిత్రకళలను చూసి ఫిదా అయ్యారు. ప్రపంచ సుందరీమణుల పోటీల సందర్భంగా ప్రభుత్వం హైదరాబాద్ శిల్పారామంలో హస్తకళలు, చేతి వృత్తుల ప్రదర్శనలకు ప్రత్యేకస్టాల్స్ ఏర్పాటుచేశారు. చేర్యాలకు చెందిన నకాశీ కళాకారులు పసుల మంగ-మల్లేశం దంపతులకు అవకాశం కల్పించడంతో స్టాల్‌లో తమ పెయింటింగ్స్, మాస్కను ప్రదర్శించారు. ఆయా చిత్రకళలు సుందరీమణుల మది దోచుకున్నాయి. చూడముచ్చటగా కనిపించడంతో కళాకారులను తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కళాకారులతో ముచ్చటించి మాస్కలు తయారుచేసి ఆనందపడ్డారు. వారసత్వ కళాసంపదను కాపాడుతుండడంపై పసుల మంగ-మల్లేశంలను అభినందించారు.

- చేర్యాల, మే 22, (ఆంధ్రజ్యోతి)

విన్నపాలు వినవలె..



నేడు జహీరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

- ఉమ్మడి మెదక్ జిల్లాలో సమస్యల స్వాగతం
- సంగమేశ్వర, బసవేశ్వర సాగునీటి ప్రాజెక్టులపై ఆశలు
- ట్రైడెంట్ చక్కెర కర్మాగారాన్ని తెరిపించాలని రైతుల విన్నపం
- మియాపూర్-సంగారెడ్డి మెట్రోరైలు సాకారమయ్యేనా?
- ఘన్‌పూర్ ప్రాజెక్టు ఎత్తు పెంచాలని డిమాండ్
- పరిష్కారానికి నోచని మల్లన్నసాగర్ నిర్వాసితుల వెతలు
- పెండింగ్‌లో దుబ్బాక, రామాయంపేట, చేర్యాల డివిజన్లు
- సిద్దిపేటలో అభివృద్ధి పనులకు నిధుల కొరత

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలిసారి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడానికి సంగారెడ్డి జిల్లాలో అడుగుపెడుతున్నారు. నేడు ఉదయం జహీరాబాద్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ప్రచారంతోపాటు ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొనడానికి పలుమార్లు ఆయన ఉమ్మడి జిల్లాకు వచ్చారు. కానీ ఎలాంటి బహిరంగ సభలు నిర్వహించలేదు. గతంలో మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గా ఆలయం, మెదక్ చర్చిలను సందర్శించి అభివృద్ధి పనులు చేపట్టారు. సిద్దిపేట జిల్లాలోనూ ఓ కూల్‌డ్రింక్ కంపెనీ ప్రారంభానికి అప్పట్లో విచ్చేశారు. కానీ, తొలిసారి ప్రజల సమక్షంలో బహిరంగసభలో మాట్లాడనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన రాకపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం నిధుల విడుదల చేస్తారని.. కొత్త వరాలు కురిపిస్తారని ఎదురుచూస్తున్నారు.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మే 22

7





జహీరాబాద్‌లో సిద్ధమవుతున్న సీఎం రేవంత్‌రెడ్డి సభావేదిక

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదు

రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

జహీరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ డివిజన్‌లో నేడు జరగనున్న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. సీఎం పర్యటన ఏర్పాట్లను గురువారం ఆయన ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, కలెక్టర్ వల్లూరు క్రాంతి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎస్పీ పంకజ్‌పరితోష్ తదితరులతో కలిసి పరిశీలించారు. అనంతరం వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సభాప్రాంగణం వద్ద ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రముఖుల సీటింగ్ ఏర్పాట్లు ఎలాచేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. వీఐపీల గ్యాలరీ, ప్రజావేదిక తదితరాలపై ఆరా తీశారు. సీఎం ప్రారంభించనున్న కేంద్రీయ విద్యాలయం, బసవేశ్వర విగ్రహం, హెలీప్యాడ్ వద్ద పనులు, వాహనాల పార్కింగ్ కోసం చేస్తున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బహిరంగ సభావేదిక వద్ద రాత్రి వరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీమంత్రి చంద్రశేఖర్, నాయకుడు ఉజ్వల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హుగ్గెల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి దామోదర్, ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్

విజయవంతం చేయాలి : ఎంపీ

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, మాజీమంత్రి చంద్రశేఖర్, రాష్ట్ర నాయకుడు సిద్ధం ఉజ్వల్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపీ కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. సీఎం సభకు 30 వేల మంది తరలివస్తారని అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రెండ్రోజుల క్రితం మాజీ మంత్రి హరీశ్‌రావు జహీరాబాద్ వచ్చిన సందర్భంగా మాట్లాడుతూ సీఎంపై అర్థంలేని విమర్శలు చేశారని మండిపడ్డారు. ఆయన విమర్శల్లో పసలేదని, ప్రజలు పట్టించుకోరని అన్నారు. సమావేశంలో నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

శ్రీ ఆంజనేయం..

- జిల్లాలో వాడవాడలా హనుమాన్ జయంతి వేడుకలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు



సిద్దిపేట కల్చరల్/హుస్నాబాద్ టౌన్ మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో హనుమాన్ జయంతి వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్దిపేటలోని శివాజీనగర్‌లోని పవనసుత పంచముఖి హనుమాన్ ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆయా ప్రాంతాల్లోని హనుమాన్ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రంగధాంపల్లి హనుమాన్ ఆలయంలో మాలధారణ స్వాములు మాల విరమణకు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం పూజలు

హుస్నాబాద్‌లో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. దాస ఆంజనేయ స్వామి ఆలయంలో పంచామృత అభిషేకం, తమలపాకుల అభిషేకం, గణేశ్ హోమం, చందనాభిషేకం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత పాల్గొన్నారు.



హుస్నాబాద్ శివాజీనగర్ దాస ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మెప్మా బంగారమాయే

- ప్రజల సొమ్ముతో పసిడి కొనుగోలు
- మహిళల పొదుపు సొమ్ము ఖాళీ
- త్రిసభ్య కమిటీ విచారణలో విస్తుపోయే వాస్తవాలు
- మూడు నాలుగు రోజుల్లో విచారణ పూర్తయ్యే అవకాశం

గజ్వేల్, మే 22 (ఆంధ్రజ్యోతి): మెప్మా 'బంగారం' అయింది. కాయకష్టం చేసి కూలీనాలి చేసి తిండి తినక కూడబెట్టిన ప్రజల సొమ్ముతో మెప్మా ప్రతినిధులు బంగారాన్ని కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఆయా గ్రూపు సభ్యుల ఫిర్యాదుతో కలెక్టర్ మనుచౌదరి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని మెప్మాలో జరుగుతున్న నిధుల పక్కదారి అంశంపై పూర్తిస్థాయి నివేదికను అందించాలని జిల్లా ఆడిటర్ జయశ్రీ నేతృత్వంలో త్రిసభ్య కమిటీని నియమించారు. కమిటీ విచారణలో విస్తుపోయే వాస్తవాలు బయటకు వస్తున్నాయి. మహిళా సంఘాల రుణాలను పక్కదారి పట్టించిన వ్యక్తులు సదరు డబ్బుతో దాదాపు కిలో పసిడి కొనుగోలు చేసినట్లు తెలుస్తుంది. ఆయా మహిళా సంఘాల్లో నెలకు రూ.100 చొప్పున పొదుపు చేసిన సొమ్మును సైతం ఖాళీ చేసినట్లు అధికారులు గుర్తించారు. ఇదే విషయాన్ని ఇటీవల జిల్లా ఆడిటర్ జయశ్రీ మీడియా ముఖంగా వెల్లడించారు.

రికవరీపై దృష్టి పెట్టాలంటున్న బాధితులు

మెప్మా నిధుల పక్కదారి అంశంలో సొమ్మును కొల్లగొట్టిన వ్యక్తుల నుంచి రికవరీ చేసి బ్యాంకులో తమ పేర్లపై ఉన్న రుణాలను మాఫీ చేయాలని బాధితులు కోరుతున్నారు. ఈ దిశగా త్రిసభ్య కమిటీ సభ్యులు, కలెక్టర్, అదనపు కలెక్టర్ దృష్టి సారించాలని బాధితులు కోరుతున్నారు. కాయకష్టం చేసి బతికే తాము లక్షల రూపాయల రుణాలను కట్టలేమని, ప్రభుత్వం, జిల్లా అధికారులు స్పందించిన తగిన న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆత్మహత్యలకు ఒడిగట్టడం తప్ప వేరే మార్గం లేదని ఆవేదన చెందుతున్నారు.

విచారణ పూర్తికి అవకాశం

మెప్మా నిధుల పక్కదారి అంశంలో కలెక్టర్ ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ సభ్యులు మూడు, నాలుగు రోజుల్లో నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో ఎనిమిది మహిళా సంఘాలకు సంబంధించిన సభ్యులను త్రిసభ్య కమిటీ బృందం విచారణ చేసింది. రుణాలను మంజూరు చేయడంలో కీలకంగా వ్యవహరించిన బ్యాంకర్లను ఆయా అంశాలపై ఆరా తీసి, వివరాలను సేకరించినట్లు తెలుస్తోంది. పూర్తిస్థాయి వివరాలతో కూడిన నివేదికను కలెక్టర్‌కు అందించే అవకాశం ఉంది. నివేదిక అందిన అనంతరం కలెక్టర్ నిర్ణయం తీసుకోనున్నారని ఓ అధికారి తెలిపారు.

కన్నతల్లే కడతేర్చింది!

- అపహరణకు గురైన బాలుడి కథ విషాదాంతం
- చంపి బావిలో పడేసి కిడ్నాప్ డ్రామా ఆడినట్లు వెల్లడి
- మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు 6



వైద్య, ఆరోగ్యశాఖ ప్రాంతీయ శిక్షణ కేంద్ర భవనం

30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి సేఫ్..

- కూల్చొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశం
- ఆసుపత్రి వెనుక స్థలంలో 150 పడకల భవనాన్ని నిర్మించాలని సూచన
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హుస్నాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన రూ.2కోట్లతో రిపేరు.. రెండున్నరేళ్లకే కూల్చివేత కథనానికి రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. హుస్నాబాద్‌లోని 30 పడకల ఆసుపత్రిని కూల్చవద్దని అధికారులను ఆదేశించారు. ఇటీవల ఆయన ఈ ఆసుపత్రిని సందర్శించారు. 30 పడకల ఆసుపత్రి వెనకు భాగంలోని ఖాళీ స్థలంతో పాటు శిథిలావస్థకు చేరిన వైద్య, ఆరోగ్య శాఖ ప్రాంతీయ శిక్షణ కేంద్ర భవనాన్ని కూల్చి దానిస్థానంలో 150 పడకల నూతన ఆసుపత్రిని నిర్మించాలని సూచించారు. అవసరమైతే అంతస్తులను పెంచాలని ఆదేశించినట్లు సమాచారం.

పనితీరుకు గుర్తింపు

- 'గజ్వేల్ ప్రజ్ఞాపూర్'కు ఉత్తమ పర్యావరణ పనితీరు అవార్డు
- జూన్5న అవార్డు ప్రదానం

గజ్వేల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీకి తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఉత్తమ పర్యావరణ పనితీరు అవార్డును ప్రకటించిందని మునిసిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య పేర్కొన్నారు. రాష్ట్రంలోని తుర్కయంజాల్, నార్సింగి, కోరుట్ల, నారాయణపేట, శంకర్‌పల్లి మునిసిపాలిటీలతో పాటు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీకి ఈ అవార్డు దక్కిందన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భగా జూన్ 5న టీజీపీసీబీ ఆడిటోరియం సనత్‌నగర్‌లో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును అందించనున్నారని కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఈ నెల 25న జీపీవో పరీక్ష

- పరీక్ష రాయనున్న 142 మంది
- ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

సిద్దిపేట కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామ రెవెన్యూ వ్యవస్థ బలోపేతంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తెరపైకి తెచ్చిన గ్రామపాలన అధికారి (జీపీవో) నియామక ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. తిరిగి మాతృశాఖకు వచ్చేందుకు దరఖాస్తు చేసుకున్న పూర్వ పూర్వ వీఆర్వో, వీఆర్ఏలకు ఈనెల 25న రాత పరీక్ష జరగనుంది. ఇందు కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 142 మంది జీపీవో పరీక్ష రాయనున్నారు. హాల్‌టికెట్‌పై ప్రస్తుత శాఖాధికారి(కంట్రోలింగ్ ఆఫీసర్) సంతకంతో పాటు అభ్యర్థి ఫొటో అతికించి, ఐడెంటి కార్డుతో పరీక్షకు హాజరుకావాలని అధికారులు తెలిపారు. పరీక్షకు హాజరవుతున్న వారిలో వీఆర్వోలు 68 మంది, 74 మంది వీఆర్ఏలు ఉన్నారు. భూభారతి చట్టం పూర్తి స్థాయిలో అమలయ్యే నాటికీ జీపీవోల నియామక ప్రక్రియ ముగించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గ్రామ పాలన అధికారుల పరీక్ష నిర్వహణపై జిల్లా కలెక్టర్ మను చౌదరి సంబంధిత శాఖ అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

శిశుగృహకు శిశువు తరలింపు

సంగారెడ్డి అర్బన్, మే 22(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని ఎంసీహెచ్ ఆవరణలో లభ్యమైన గుర్తు తెలియని శిశువును శిశుగృహకు తరలించారు. ఈ నెల 17 న గుర్తుతెలియని వ్యక్తులు ఆస్పత్రి ప్రాంగణంలో శిశువును వదిలేసి వెళ్లిన విషయం తెలిసిందే. అయితే లభ్యమైన పసికందును ఇన్ని రోజులు ఎంసీహెచ్‌లోని ఎస్ఎన్‌సీయూలో ఇంక్యూబేటర్‌లో ఉంచి చికిత్స అందించారు. శిశువు పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నట్టు నిర్ధారించుకున్న ఆస్పత్రి అధికారులు శిశుగృహకు అప్పగించారు.



వర్షం మాటున విషం

చెరువుల్లోకి వ్యర్థ రసాయన జలాలు వదులుతున్న పరిశ్రమలు

- నెలలపాటు నిల్వ చేసి వానొచ్చినప్పుడు వదులుతున్న యాజమాన్యాలు
- కలుషిత, విషపూరిత జలాలతో నిండుతున్న చెరువులు, కుంటలు
- పాడవుతున్న పంట పొలాలు.. మూగజీవాలు, చేపల మృత్యువాత
- చోద్యం చూస్తున్న పీసీబీ అధికారులు

గుమ్మడిదల, మే 22 (ఆంధ్రజ్యోతి) : వానొచ్చనంటే.. వరదొస్తది.. వరదతోపాటు రసాయనాలొస్తాయి.. అన్నట్లుగా మారింది గుమ్మడిదల మండలంలోని పలు ప్రాంతాల పరిస్థితి. మండలంలోని బొంతపల్లి పారిశ్రామిక వాడలో వర్షపు నీటిలో పరిశ్రమల నుంచి వెలువడే రసాయన వ్యర్థ జలాలు వదులుతున్నారు. భారీ వర్షం వచ్చినప్పుడల్లా ఈ పారిశ్రామిక వాడలోని ఫార్మసీ, పెద్ద పెద్ద పరిశ్రమలు నెలలపాటు నిల్వ చేసిన వ్యర్థ జలాలను అవుట్ లైన్ ద్వారా బయటికి వదులుతున్నారు. ఆ వరద నీరంతా సమీపంలోని చెరువులు, కుంటల్లో వచ్చి చేరుతుండంతో కాలుష్య కాసారంగా మారతున్నాయి. రైతుల పొలాల మీది నుంచి వరద పరుగు పెడుతుండడంతో రసాయనాల ఘాటుకు పంటలన్నీ నాశనమవుతున్నాయి. అంతేకాకుండా చెరువులు, కుంటల్లోని చేపలు, నీటిని తాగుతున్న మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. పరిశ్రమల కలుషిత జలాలను బయటికి రాకుండా అరికట్టాల్సిన పీసీబీ అధికారులు చోద్యం చూస్తుండడంతో సదరు యాజమాన్యాలు మరింత రెచ్చిపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. బుధవారం కురిసిన భారీ వర్షానికి దోమడుగు గ్రామంలోని నల్లకుంట. ఇతర వాగులు పెద్ద పరిశ్రమ నుంచి వచ్చిన రసాయన జలాలతో నిండాయి. ఎకరాల కొద్ది వరి పంట నాశనమైంది. ప్రజల ఆరోగ్యంపై కూడా ఈ కలుషిత జలాల ప్రభావం తీవ్రంగా పడుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరిశ్రమల వ్యర్థ జలాలు బయటకు రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


రసాయన జలాలతో నిండిన దోమడుగు నల్లకుంట చెరువు


దోమడుగులో రసాయన జలాల కారణంగా పాడైన వరి పంట

జిల్లా మంత్రి దృష్టికి తీసుకుపోతాం



వర్షాన్ని అడ్డుపెట్టుకొని కొన్ని పరిశ్రమలు విచ్చలవిడిగా రసాయన జలాలను అవుట్ లైన్ ద్వారా బయటికి వదిలుతున్నారు. దీంతో పంటలు దెబ్బతింటున్నాయి. కుంటలు, చెరువులు కలుషితంగా మరాయి. ఈ ప్రాంతాన్ని కాలుష్యమయంగా మారుస్తున్న రసాయన పరిశ్రమలను గుర్తించి చర్యలు తీసుకోవాలి. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు జిల్లా మంత్రి దృష్టికి తీసుకుపోతాం.

-పుట్ట నర్సింగరావు,
కాంగ్రెస్ మండల అధ్యక్షుడు




బావిలో నుంచి వెలికి తీసిన బాలుడి మృతదేహం (వృత్తంలో), బాలుడి ఫైల్ ఫొటో

కన్నతల్లే కడతేర్చింది!

- అపహరణకు గురైన బాలుడి కథ విషాదాంతం
- చంపి బావిలో పడేసి కిడ్నాప్ డ్రామా ఆడినట్లు వెల్లడి
- మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

దుబ్బాక, మే22(ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని రెండునెలల బాలుడిని తల్లే చంపేసి బావిలో పడేసింది.. ఆపై తన ఒడిలోనుంచి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని కిడ్నాప్ డ్రామా ఆడి.. చివరకు కటకటాలపాలైంది. గురువారం ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామంలో శ్రీమాన్, కవిత దంపతుల రెండు నెలల బాలుడి అపహరణ మిస్టరీగా మారింది. తన భర్త ఈ నెల 17న పనికోసం మిరుదొడ్డి మండలం రుద్రారం గ్రామానికి వెళ్లగా ఇంటి వద్ద బాబుతో ఉంటున్నానని, బుధవారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులు మాస్కులు ధరించి వచ్చి మాటకలుపుతూ ఒక్కసారిగా తన ఒడిలోని బాలుడిని అపహరించుకుని పోయారని కవిత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నది. తాను అరిచినా కూడా చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో రాలేదని పేర్కొన్నది. ఈ మేరకు దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గంగరాజు కిడ్నాప్ కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తును ముమ్మరం చేశారు. తీరా విచారణలో కవి తనే తన కుమారుడిని కడతేర్చినట్లు తేలింది. బాలుడిని చంపి గ్రామంలోని ఓ బావిలో పడేసి.. కిడ్నాప్ కథ అల్లినట్లుగా చెప్పింది. ఆమె ఇచ్చిన సమాచారం మేరకు దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గంగరాజు అక్కడికి చేరుకుని పసిబాలుడిని మృతదేహాన్ని వెలికితీశారు. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతమంతా స్థానికుల రోదనలతో నిండిపోయింది. అయితే ఇంకా కేసు విచారణ దశలో ఉందని, పూర్తయిన వెంటనే వివరాలు వెల్లడిస్తామని దుబ్బాక సీఐ శ్రీనివాస్ తెలిపారు. కేసు విచారణ దశలో ఉండటంతో పోలీసులు పూర్తి వివరాలను అందించడంలేదు. పసిబాలుడిని ఎందుకు హత మార్చాల్సి వచ్చిందనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

ఆగి ఉన్న డీసీఎంను ఢీకొన్న బైక్

● ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు


మహేష్ (ఫైల్)

చేగుంట, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న డీసీఎంను బైక్ వెనుక నుంచి ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన చేగుంట మండల పరిధిలోని వడియారం గ్రామ శివారులో చోటుచేసుకుంది. చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చిన్న శంకరంపేట మండలం సూరారం గ్రామానికి చెందిన పిట్ల మహేష్ (22) అదే గ్రామానికి చెందిన తన మిత్రుడు గొల్ల మధుతో కలిసి మాసాయిపేటలో తన మిత్రుడి పుట్టిన రోజు వేడుకలకు వెళ్లాడు. బుధవారం అర్ధరాత్రి బైక్‌పై తిరిగి వస్తుండగా వడియారం గ్రామ శివారులోని రోడ్డు పక్కకు ఆగి ఉన్న డీసీఎం వ్యాన్‌ను వెనుక నుంచి ఢీకొనడంతో మహేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మధుకు తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మహేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి కమలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


పరుశరాములు (ఫైల్)

నిజాంపేట, మే 22(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన కంపే పరుశరాములు(34) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. అతడు ప్రైవేట్ ఫైనాన్స్‌లో 80వేలు లోన్ తీసుకుని ట్రాక్టర్ కొనుగోలు చేయడంతోపాటు తెలిసినవారి వద్ద కొంతమేర అప్పులు చేశాడు. కొన్ని నెలలుగా ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ట్రాక్టర్ కిస్తీలు కట్టలేక, మరోవైపు బయట తెచ్చిన అప్పులు తీర్చే మార్గం లేక బుధవారం రాత్రి తన ఇంట్లోని దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య బాలమణి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పీఎస్ఐ సృజన తెలిపారు.

అకౌంట్ నుంచి రూ.34 వేలు మాయం

● పీఎం కిసాన్ యాప్ ద్వారా బదిలీ అయినట్లు గుర్తించిన బ్యాంకు అధికారులు

హత్నూర, మే 22 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.34వేలు పీఎం కిసాన్ యాప్ ద్వారా పోయినట్లు బాధితుడు గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. హత్నూర మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన ఎరుకల యాదగిరి తన బ్యాంకు ఖాతాలో నుంచి పీఎం కిసాన్ యాప్ ద్వారా ఈ నెల 18న రూ.34వేలు కట్ అయినట్లు గుర్తించాడు. దీంతో దౌల్తాబాద్‌లోని ఇండియన్ బ్యాంకుకు వెళ్లి అధికారులను ఆరా తీయగా పీఎం కిసాన్ యాప్ ద్వారా కట్ అయ్యాయని వారు నిర్ధారించారు. వెంటనే బాధితుడు మీసేవ ద్వారా సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాజాగా గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఎస్ఐ శ్రీధర్ రెడ్డిని సంప్రదించగా.. బాధితుడు ఎరుకల యాదగిరి తనకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడని తెలిపారు. ఇలాంటి సైబర్ నేరాలు జరిగిన రెండు గంటల్లోపు లేదా ఒక రోజులోపు సమాచారం ఇస్తే డబ్బులు రికవరీ అయ్యే అవకాశం ఉందన్నారు. ఓటీపీలు గాని ఇతర యాప్‌ల ద్వారా లింకులు వస్తే షేర్ చేయవద్దని ఎస్ఐ సూచించారు.

పాముకాటుతో పాడి ఆవుల మృతి




చేర్యాల, మే 22 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో పాముకాటుకు గురై రెండు పాడి ఆవులు మృతి చెందిన సంఘటన గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సోంరెడ్డి యశ్వంత్ రెడ్డి రోజులాగే బుధవారం వ్యవసాయపనులు ముగించుకుని పాడిఆవులను వ్యవసాయబావివద్ద కట్టివేసి ఇంటికి చేరుకున్నాడు. గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూసేసరికి రెండు ఆవులు మృత్యువాత పడి ఉన్నాయి. ఆందోళన చెందిన అతను చుట్టుపక్కల పరిశీలించగా పాములు సంచరిస్తూ కనిపించడంతో పాముకాటుకు గురై ఆవులు మృతిచెందాయని గుర్తించాడు. మృతిచెందిన ఆవుల విలువ రూ.2.60లక్షల ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

ధాన్యం లారీ బోల్తా

●డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

వెల్దుర్తి, మే 22 (ఆంధ్రజ్యోతి) : అదుపుతప్పి ధాన్యం లారీ బోల్తాపడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. మంగళపర్తి పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం నంచి ధాన్యాన్ని నింపుకుని వెల్దుర్తి రైస్‌మిల్లుకు వస్తున్న క్రమంలో మండల పరిధిలోని మన్నెవారి జలాల్‌పూర్ మూలమలుపు వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్ ఇస్మాయిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. లారీలో ఉన్న 693 ధాన్యం బస్తాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. విషయం తెలుసుకున్న తహసీల్దార్ బాలలక్ష్మి, ఆర్ఐ నర్సింగ్‌యాదవ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.


బోల్తా పడిన లారీ

ముఖ్యమంత్రికి సీపీఎం బహిరంగ లేఖ

సంగారెడ్డి రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి సంగారెడ్డి జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో సీపీఎం పార్టీ బహిరంగ లేఖను విడుదల చేసింది. ఈ లేఖను సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో గురువారం సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ విడుదల చేశారు. జిల్లాలో వందలాది పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారికి కనీస వేతనాలు, ఈఎస్‌ఐ, పీఎఫ్ ఇతర చట్టపరమైన సౌకర్యాలు అమలు కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని లేఖలో పేర్కొన్నారు. కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఆర్‌ఆర్‌ఆర్‌తో పాటు, జహీరాబాద్‌లోని నిమ్జ్‌తో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారంతో పాటు పునరావాసం కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మంజీరా నదిపై ఎత్తిపోతల ప్రాజెక్టు ఏర్పాటు చేసి నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్, సంగారెడ్డికి పూర్తిస్థాయిలో సాగునీరందించాలని కోరారు. జిల్లాలోని అన్ని గ్రామాలకు మంజీరా జలాలు సరఫరా చేయాలని, మంజీరాను కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి భేష్

● బీహార్ రాష్ట్ర సర్పంచులు కితాబు



గూడెంగడ్డలో బీహార్ రాష్ట్ర సర్పంచ్‌లు

నర్సాపూర్, మే 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి ఎంతో అద్భుతంగా ఉందని బీహార్ రాష్ట్ర సర్పంచులు అభినందించారు. 90 మంది బీహార్ రాష్ట్ర సర్పంచులు రెండు బృందాలుగా గురువారం నర్సాపూర్ మండలం గూడెంగడ్డం, నారాయణపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో గ్రామస్థులతో మాట్లాడటమే కాకుండా గ్రామాల్లో పాలన విధానం, చేసిన అభివృద్ధి, నిధుల తీరును అడిగి తెలుసుకున్నారు. చెత్త సేకరించి డంపుయార్డుకు తరలించే విధానంతో పాటు, నర్సరీ, శ్మశానవాటికలను సందర్శించారు. ప్రతీ ఇంటికి మిషన్‌భగీరథ నీటి సరఫరాను తెలుసుకున్నారు. బృందం వెంట ఎంపీడీవో మాధవిలత, ఏపీఎం గౌరిశంకర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

కొండపోచమ్మను సందర్శించిన ఉబ్జెకిస్థాన్ అధికారులు

మర్కుక్, మే 22 (ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్‌ను ఉబ్జెకిస్థాన్ ఉన్నతాధికారులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్యనిర్వాహక ఇంజనీర్ రఘునాథ్ ప్రసాద్ వారికి కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ నిర్మాణ ప్రక్రియను వివరించారు. రిజర్వాయర్ నిర్మాణంలో వినియోగించిన ఆధునిక సాంకేతిక, నిర్మాణంలో ఎదురైన సవాళ్లను వివరించారు.



మూతపడిన ట్రైడెంట్ చక్కెర ఫ్యాక్టరీ

విన్నపాలు వినవలె

నేడు జహీరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

ఉమ్మడి మెదక్ జిల్లాలో సమస్యల స్వాగతం

సంగమేశ్వర, బసవేశ్వర సాగునీటి ప్రాజెక్టులపై ఆశలు

ట్రైడెంట్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాల్సిన అవసరం

పరిష్కారానికి నోచని మల్లన్నసాగర్ నిర్వాసితుల వెతలు

పెండింగ్‌లో దుబ్బాక, రామాయంపేట, చేర్యాల డివిజన్లు

సిద్దిపేటలో అభివృద్ధి పనులకు నిధుల కొరత

మియాపూర్-సంగారెడ్డి మెట్రోరైలు సాకారమయ్యేనా?

ఘన్‌పూర్ ప్రాజెక్టు ఎత్తు పెంచాలని డిమాండ్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మే 22 : రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్న ఉమ్మడి మెదక్ జిల్లాలో పలు సమస్యలు నెలకొన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొన్ని అభివృద్ధి పనులు చకచకా సాగుతున్నాయి. కానీ పెండింగ్ పనులతోపాటు కొత్తగా చేపట్టాల్సిన పనులు ప్రశ్నార్థకంగా మిగిలాయి.

ప్రాజెక్టుల్లో వేగం పెరిగేనా?

సంగారెడ్డి, అందోల్, జహీరాబాద్, నారాయణఖేడ్ నియోజకవర్గాలను సస్యశామలం చేసే సంగమేశ్వర, బసవేశ్వర సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ఒక అడుగు ముందుకు.. పది అడుగులు వెనక్కు అన్నట్లుగా సాగుతోంది. సుమారు 4 లక్షల ఎకరాలకు సాగునీరందించే ఈ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదే విధంగా మల్లన్నసాగర్ రిజర్వాయర్ ముంపు నిర్వాసితుల సమస్యలు ఎక్కడివక్కడే ఉన్నాయి. మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్లకు అనుసంధానంగా కాలువల నిర్మాణం నిలిచిపోయాయి. మెదక్ జిల్లాలోని ఘన్‌పూర్ మధ్యతరహాప్రాజెక్టు ఎత్తు పెంచితే మరింత ఆయకట్టుకు లబ్ధి చేకూరుతుంది. జహీరాబాద్ ప్రాంతంలోని నారింజ వాగు ప్రాజెక్టును అభివృద్ధి చేస్తే 3 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇవన్నీ వేగం పుంజుకోవాలంటే నిధులు అవశ్యం.

రెవెన్యూ డివిజన్లపై డిమాండ్‌లు

సిద్దిపేట జిల్లాలో దుబ్బాక, చేర్యాల, మెదక్ జిల్లాలో రామాయంపేట, సంగారెడ్డి జిల్లాలో పటాన్‌చెరు పట్టణాలకు రెవెన్యూ డివిజన్ హోదా కల్పిస్తామని ఎన్నికల్లో అన్ని పార్టీలు హామీలు ఇచ్చారు. ఈ ప్రతిపాదనలకు సంబంధించి ఉన్నతాధికారులు సైతం పరిశీలించారు. కానీ కొత్త డివిజన్లు సాకారం కాలేదు. రెవెన్యూ డివిజన్లపై సీఎం ప్రస్తావించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రశ్నార్థకంగా నిమ్జ్ భూసేకరణ

జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లోని 17 గ్రామాలను పారిశ్రామిక స్పెషల్ జోన్‌గా మార్చడానికి నిమ్జ్‌కు శ్రీకారం చుట్టారు. 12 వేల ఎకరాలను సేకరించి పరిశ్రమలను ఏర్పాటు చేయాలని భావించారు. ఇప్పటివరకు కేవలం 4 వేల ఎకరాలను మాత్రమే సేకరించడం జరిగింది. కానీ ఎలాంటి పరిశ్రమలను నెలకొల్పలేదు. అయితే, పారిశ్రామిక ప్రగతికి సంకేతంగా రూ.100 కోట్లతో రహదారిని మాత్రం నిర్మించారు. నేడు సీఎం దీనిని ప్రారంభిస్తున్నారు. కొన్ని పరిశ్రమలు ఏర్పాటైతే నిమ్జ్‌కు ఆటంకాలు తొలగిపోతాయి.



పటాన్‌చెరులో రహదారుల దుస్థితి

ఉమ్మడి జిల్లాలో చేయాల్సినవి..

- నారాయణఖేడ్ ప్రాంతంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.
- నారాయణఖేడ్‌లో మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు కలగా మారింది.
- జహీరాబాద్ నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి రూ.400 కోట్ల నిధులు అవసరం.
- జహీరాబాద్ మండలం కొత్తూరు-బి సమీపంలోని ట్రైడెంట్ చక్కెర కర్మాగారాన్ని తిరిగి పునరుద్ధరించాలి.
- కోహీర్ మండలంలో రెండేళ్ల కిందట హోటల్ మేనెజ్మెంట్ కళాశాల మూతబడింది. దీనికోసం రూ.12 కోట్లు ఖర్చు చేశారు. తిరిగి ప్రారంభించాల్సిన అవసరం ఉంది.
- ఝరాసంగంలోని శ్రీకేతకీ సంగమేశ్వర ఆలయానికి రూ.28 కోట్లతో అభివృద్ధి చేయాలని అంచనా వేశారు. ఈ నిధులు విడుదల చేయాలి.
- గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగురోడ్డును పూర్తి చేయించాలి.
- నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. డబుల్ బెడ్రూంలు మధ్యలోనే ఆగిపోయాయి.
- సిద్దిపేట నియోజకవర్గంలో నిధుల కొరత కారణంగా వెయ్యి పడకల ప్రభుత్వ ఆస్పత్రి, నర్సింగ్ కళాశాల, సమీకృత మార్కెట్ యార్డు, రంగనాయకసాగర్, కోమటిచెరువు టూరిజం పనులు నిలిచిపోయాయి.
- పటాన్‌చెరు నియోజకవర్గ కేంద్రం నుంచి దౌల్తాబాద్ వరకు రహదారి అధ్వాన్నంగా మారింది.
- కొల్లూరు గ్రామ శివారులో ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డును పునరుద్ధరించడానికి రైల్వే ఓవర్ బ్రిడ్జిని త్వరగా పూర్తి చేయించాలి.
- పటాన్‌చెరు నియోజకవర్గంలోని లకడారం, చిన్న కంజర్ల, మాదారం గ్రామాల్లో స్టోన్ క్వారీలను మూసివేయాలనే డిమాండ్లు నెలకొన్నాయి.
- పటాన్‌చెరు నియోజకవర్గం పాశమైలారం, ఇస్నాపూర్, రుద్రారం, ఐడీఏ బొల్లారం గ్రామాల్లోని రసాయన పరిశ్రమల నుంచి వెదజల్లే కాలుష్యాన్ని నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.
- మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు మెట్రోరైలు కోసం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అదే విధంగా సంగారెడ్డి వరకూ దీనిని పొడిగించాలనే విన్నపాలు వినిపిస్తున్నాయి. ఐటీ హైదరాబాద్‌తోపాటు జిల్లా కేంద్రమైన సంగారెడ్డికి మెట్రో ఉంటే ప్రయోజనంగా ఉంటుంది. సాధ్యాసాధ్యాలపై సీఎం చర్చించాలని విన్నవిస్తున్నారు.

జోగిపేట పీజీ కళాశాలలో కొత్త కోర్సులు

త్వరలో డేటా సైన్స్, ఎంబీఏ కోర్సుల ప్రారంభం

నర్సాపూర్ పీజీ కళాశాలలో సీట్లను పెంచుతాం

ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ కుమార్ మొలుగరం



నర్సాపూర్‌లో పీజీ కాలేజీ సొంతభవనం కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న వైస్‌చాన్స్‌లర్

జోగిపేట/నర్సాపూర్, మే 22 (ఆంధ్రజ్యోతి) : అదనంగా స్థలాన్ని కేటాయిస్తే జోగిపేట పీజీ కళాశాలలో కొత్త కోర్సులను ప్రారంభిస్తామని, విద్యార్థుల డిమాండ్ మేరకు నర్సాపూర్ పీజీ కళాశాలలో మరిన్ని సీట్లను పెంచుతామని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ మొలుగరం కుమార్ అన్నారు. గురువారం ఆయన జోగిపేట, నర్సాపూర్ పీజీ కళాశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీ కాలేజీల్లో మౌలిక సదుపాయాల కల్పన, నూతన కోర్సుల ఏర్పాటు విషయమై, ఓయూ పరిధిలోని అన్ని కళాశాలలనూ సందర్శించి, వసతులు, భవనాలు, సౌకర్యాల గురించి కూలంకషంగా విషయ సేకరణ జరుపుతున్నామన్నారు. అందులో భాగంగానే జోగిపేట, నర్సాపూర్ పీజీ కాలేజీలను కూడా సందర్శించామన్నారు. కాగా, జోగిపేట పీజీ కాలేజీలో 5 కోర్సులున్నప్పటికీ, ప్రస్తుతం లైబ్రరీ సైన్స్, కెమిస్ట్రీ విభాగాల్లో మాత్రమే పీజీ కోర్సులు కొనసాగిస్తున్నామన్నారు. గతంలో కేటాయించిన ఐదు ఎకరాల స్థలాన్ని వినియోగించు కోలేకపోయామని, అదనంగా మరో పదెకరాల వరకు స్థలాన్ని కేటాయిస్తే గతంలో ప్రారంభించి ఆపివేసిన మిగతా మూడు కోర్సులతో పాటు, కొత్తగా ఎంబీఏ, ఎమ్మెస్సీ (డేటా సైన్స్) కోర్సులనూ ప్రారంభిస్తామన్నారు. స్థలం కోసం తాము మంత్రి దామోదర్, కలెక్టర్ వల్లూరి క్రాంతిని త్వరలో కలుస్తామన్నారు. ఈ సందర్భంగా పీజీ కాలేజీ నడుస్తున్న తాత్కాలిక భవనాన్ని వైస్ చాన్స్‌లర్‌తో పాటు, మిగతా బృందం పరిశీలించింది. కాలేజీలో నెలకొన్న సమస్యలను ప్రిన్సిపాల్ డాక్టర్ గోవర్ధన్ వివరించారు. నర్సాపూర్ పీజీ కళాశాలకు సొంత భవనం లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వైస్‌చాన్స్‌లర్‌కు విన్నవించారు. ప్రిన్సిపాల్ మహేశ్వర్‌రెడ్డి కళాశాలలో నెలకొన్న సమస్యలను ఆయనకు తెలిపారు. మరో పది ఎకరాలను కేటాయిస్తే నర్సాపూర్‌లో పీజీ కాలేజీని అన్ని సదుపాయలతో సకల సౌకర్యాలతో నిర్మాణం చేయడానికి నిధులు కేటాయించేలా చూస్తామన్నారు. ఈమేరకు మెదక్ కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. వారి వెంట ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్‌నాయక్, జిల్లా పీజీ కాలేజీల డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేంద్రనాయక్, తదితరులు ఉన్నారు.

బడులు బాగు చేయకపోతే పేదలకు విద్య దూరం

● రాష్ట్ర విద్యా కమిషన్ సలహాదారులు, ఎంవీఎఫ్ జాతీయ కార్యదర్శి వెంకట్‌రెడ్డి

నిజాంపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడులు బాగు చేయకపోతే పేదలు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉన్నదని రాష్ట్ర విద్యా కమిషన్ సలహాదారులు, ఎంవీఎఫ్ జాతీయ కార్యదర్శి ఆర్.వెంకట్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగ హక్కులు, చట్టాలు, సామాజిక, ఆర్థిక రాజకీయ పరిస్థితుల నాయకత్వ లక్షణాలపై గురువారం డీబీఎఫ్ ఆధ్వర్యంలో నిజాంపేటలో శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ముందుగా విద్యా హక్కుల అమలు పరిస్థితి, సవాళ్లు, పరిష్కారాలు అనే అంశంపై ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రతీ మండలంలో నాలుగు ఆధునిక పాఠశాలలను నిర్మించాలని కోరారు. ప్రభుత్వ బడులకు వెళ్లే విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టి ప్రభుత్వ విద్య పరిరక్షణకు చట్టబద్ధ బాధ్యత చేపట్టాలన్నారు. అలాగే విద్యాహక్కు చట్టాన్ని అమలు చేసి ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం రిజర్వేషన్ కల్పించాలని పేర్కొన్నారు. బుద్ధుడు, పూలే, అంబేడ్కర్ సిద్ధాంతాలను అలవర్చుకోవాలన్నారు. సమాచార హక్కు చట్టం ఒక ఆయుధం లాంటిదని, దీనిని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈశిక్షణ శిబిరంలో దుబాసి, సంజీవ్, ఏగొండస్వామి, కె.కరుణాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంజీరాపై రబ్బర్ డ్యాం

రాయిపల్లి వంతెన వద్ద నిర్మాణం సాధ్యం

నీటిపారుదల శాఖ రిటైర్డ్ సీఈ విఠల్‌రావు

ప్రభుత్వానికి నివేదిస్తాం : ఎమ్మెల్యే సంజీవరెడ్డి



రబ్బర్ డ్యాం వివరాలను ఎమ్మెల్యేకు వివరిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

నారాయణఖేడ్, మే 22 (ఆంధ్రజ్యోతి) : మంజీరా నదిపై నూతన సాంకేతికతతో రబ్బర్ డ్యాంను నిర్మించాలని ప్రతిపాదనల తయారీకి కసరత్తును ప్రారంభించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి నివాసంలో గురువారం సాధ్యాసాధ్యాలపై ఇరిగేషన్ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ విఠల్‌రావు, హైడో కన్‌స్ట్రక్షన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.శ్రీధర్‌రెడ్డి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్.ప్రకాష్‌రెడ్డి, మనూరు మండల ఇరిగేషన్ ఏఈఈ విద్య సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ విఠల్‌రావు మాట్లాడుతూ మంజీరా నదిపై రాయిపల్లి వంతెన వద్ద రబ్బర్ డ్యాం నిర్మాణం సాధ్యపడుతుందన్నారు. దీని నిర్మాణం వల్ల భారీగా నీటినిల్వ సామర్థ్యం పెరిగి తాగునీటి పథకాలతో పాటు, సాగునీటికి ఉపయోగపడుతుందన్నారు. 10 నుంచి 12 టీఎంసీల నీటి నిల్వతో పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాలు గణనీయంగా పెరిగేందుకు ఆస్కారం ఉందన్నారు. రబ్బర్ డ్యాం 400 మీటర్ల పొడవు, ఐదు మీటర్ల ఎత్తు వరకు నిర్మించుకునే అవకాశం ఉందని తెలిపారు. నీటి ఫ్లోను బట్టి డ్యాం ఎత్తు, తగ్గులు చేసుకునే వీలుందన్నారు. డ్యాం వల్ల పూడిక నిండే సమస్య ఉండదని, కుడి, ఎడమ కాలువలను సైతం ఏర్పాటు చేసుకొని సాగునీటిని మళ్లించుకునే వీలుంటుందని తెలిపారు. పూర్తి అంశాలతో ప్రాజెక్టు రిపోర్టు తయారు చేసి తనకు అందజేస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. జిల్లా రైతులు, తాగునీటి అవసరాలు, భూగర్భజలాల పెంపు లక్ష్యంగా ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వం ద్వారా కృషి చేస్తానని చెప్పారు. మంజీరాపై సింగూరు ప్రాజెక్టు నిర్మాణంతో ఖేడ్ నియోజకవర్గ రైతుల ఎక్కువగా భూములు కోల్పోయారని గుర్తుచేశారు. 40 వేల ఎకరాలు ముంపునకు గురైందన్నారు. మంజీరా నదిపై నిర్మించ తలపెట్టిన డ్యాంతో ఖేడ్ ప్రాంతంతో పాటు జిల్లాకు ప్రాజెక్టు అన్ని రకాలుగా ఉపయోగపడాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, మాజీ ఎంపీపీ రమేష్ చౌహాన్, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన వనం

మూడేళ్ల నుంచి వృథాగా అర్బన్ ఫారెస్ట్ పార్క్‌లు



మనోహరాబాద్ అర్బన్ పార్క్ (నాడు)



ప్రస్తుతం

పచ్చని చెట్లు.. స్వచ్ఛమైన గాలి.. కట్టిపడేసే ప్రకృతి అందాలు.. ఎటుచూసిన ఆహ్లాదకరమైన వాతావరణం కనిపించే అర్బన్ ఫారెస్ట్ పార్క్‌లు అధ్వానంగా మారాయి. మెదక్ జిల్లాలో కోట్లాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన వడియారం, మనోహరాబాద్, పరికిబండ ఉద్యానవనాలు ప్రారంభానికి నోచుకోకముందే అధ్వానంగా తయారయ్యాయి. నిర్మాణాలు దెబ్బతిని, పిచ్చి మొక్కలతో కళావిహీనంగా మారాయి.

\- తూప్రాన్, మే 22(ఆంధ్రజ్యోతి)

ఇంకా ప్రారంభోత్సవానికి నోచుకోలేదు..

అప్పుడే దెబ్బతిన్న నిర్మాణాలు

పిచ్చి మొక్కలతో కళావిహీనం

ఔటర్ రింగ్ రోడ్డుకు వెలుపల ప్రధాన రహదారులకు సమీపంలో అర్బన్ ఫారెస్ట్ పార్కుల ఏర్పాటుకు నిర్ణయించారు. వీటిని వీకెండ్ టూరిస్ట్ స్పాట్లుగా తీర్చిదిద్దడానికి హెచ్‌ఎండీఏ నడుం బిగించింది. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని హైవే 44 పక్కనే దండుపల్లి వద్ద మనోహరాబాద్ అర్బన్ పార్క్, తూప్రాన్ మండలం ఇమాంపూర్ స్టేజీ వద్ద పరికిబండ పార్క్, చేగుంట - మెదక్ రహదారి పక్కనే వడియారం రిజర్వ్ ఫారెస్ట్‌లో పొలంపల్లి వద్ద ఏర్పాటు చేశారు. మనోహరాబాద్ అర్బన్ ఫారెస్టు పార్కుకు రూ.2 కోట్లు, పరికిబండ పార్కుకు రూ.1.16 కోట్లు, వడియారం పార్కుకు రూ.1.14 కోట్ల నిధులు కేటాయించారు. హెచ్‌ఎండీఏ పరిధిలోని అటవీ, ఇంజనీరింగ్ విభాగాలు 2019లో పనులకు శ్రీకారం చుట్టారు. రెండేళ్లలోనే పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని అప్పట్లోనే అధికారులు ప్రకటించారు. కానీ, మూడేళ్ల పాటు పనులు కొనసాగగా, 2022 నాటికి పూర్తి చేశారు. మూడేళ్లవుతున్నా ఇంతవరకు ప్రారంభానికే నోచుకోలేవు.

ఆకర్షణీయంగా.. ఆహ్లాదకరంగా

మనోహరాబాద్ అర్బన్ ఫారెస్టు పార్కులో పరిధిలోని 129 హెక్టార్లలలో 80,317 మొక్కలు నాటగా, పరికిబండ పార్కులోని 220 హెక్టార్లలలో 1.30 లక్షల మొక్కలను నాటారు. ప్రధానంగా ఆక్సిజన్ అందజేసే వేప, రావి, మర్రి, ఇప్ప, చింత, తాని, నారేపి, అల్లనేరేడు, మారేడు తదితర మొక్కలు నాటారు. అందమైన వాకింగ్ రోడ్లను ఏర్పాటు చేశారు. వాచ్ టవర్లను నిర్మించారు. ధ్యాన మందిరం, యోగా షెడ్డు ఏర్పాటు చేశారు. సేద తీరేందుకు గుర్రం, తాబేలు, యాపిల్, అరటిపండు, పుచ్చకాయ, కలప ఆకారంలో కూర్చుండే బల్లలను ఏర్పాటు చేశారు. ప్రధాన ద్వారాన్ని ఆకర్షణీయంగా ద్వారం రూపొందించారు. పరికిబండ అర్బన్ ఫారెస్టు పార్కు చుట్టూరా రూ.16 కోట్ల వ్యయంతో 40 కిలోమీటర్ల పొడవున ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. మనోహరాబాద్ అర్బన్ పార్కుకు 4 కిలోమీటర్ల పొడవు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. వడియారం పార్కు చుట్టూరా 11 కిలోమీటర్ల పొడవు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.



దెబ్బతిన్న పుచ్చకాయ ఆకారం బెంచీ

ప్రారంభం మరిచిపోయారు..

హెచ్‌ఎండీఏ అర్బన్ ఫారెస్టు పార్కుల నిర్మాణ పనులు ఆరేళ్ల క్రితం 2019లో చేపట్టి 2022 నాటికి పనులు పూర్తి చేశారు. 2022లో అప్పటి మంత్రి హరీశ్ రావుతో ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేశారు. ఇప్పుడు.. అప్పుడు ప్రారంభోత్సవం అంటూ వాయిదా వేస్తూ వచ్చారు. ప్రారంభం నాటికి మరింత అభివృద్ధి పరిచేందుకు నిర్ణయించారు. ఈ అర్బన్ ఫారెస్టు పార్కుల్లో సైకిల్ ట్రాక్, చిల్డ్రన్స్ ప్లేగ్రౌండ్‌లు ఏర్పాటు చేసే ప్రయత్నాలు చేపట్టి, ఇందుకు ప్రతిపాదనలను కూడా సిద్ధం చేశారు. కానీ, ప్రారంభోత్సవం చేయకపోగా, అర్బన్ ఫారెస్టు పార్కులను పట్టించుకోవడం మరిచిపోయారు.



పరికిబండ పార్క్ (నాడు)



ప్రస్తుతం

నిర్వహణ లేక..

అర్బన్ ఫారెస్టు పార్కులు నిర్మాణం పూర్తిచేశాక నిర్వహణను అటవీశాఖకు అప్పగించారు. ఇప్పటికే నిధులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అటవీశాఖకు అర్బన్ ఫారెస్టు పార్క్‌ల నిర్వహణ తలకుమించిన భారంగా తయారైంది. నిర్వహణను లేక పార్కుల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. చెట్లు సైతం ఎండిపోతున్నాయి. పార్కులో వేసిన రోడ్లు, కళాకృతులు, స్వాగత తోరణాలు దెబ్బతినిపోయాయి. హెచ్‌ఎండీఏ ఏర్పాటు చేసిన అర్బన్ ఫారెస్టు పార్కుల నిర్వహణకు హెచ్‌ఎండీఏ అధికారులు చొరవ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



నాడు - నేడు

ప్రారంభం నాటికి పార్కులోని రోడ్లు, నిర్వహణ లేక ప్రస్తుతం ఇలా..



నాడు - నేడు

గతంలో గుర్రం ఆకృతి బల్ల, ప్రస్తుతం పిచ్చిమొక్కల మధ్య...

న్యూస్ బాక్స్

డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురికి జరిమానా

● ఒకరికి జైలుశిక్ష

గజ్వేల్, మే 22 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన ఐదుగురికి రూ.6500 జరిమానా, ఒకరికి మూడు రోజుల జైలుశిక్ష విధిస్తూ గజ్వేల్ అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ తీర్పును వెలువరించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళీ తెలిపారు. కొన్ని రోజుల క్రితం గజ్వేల్ పట్టణంలోని ఆయా చౌరస్తాలలో డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు జరుపగా, ఐదుగురు వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారన్నారు. వారిని గురువారం కోర్టులో హాజరుపరచగా, విచారణ చేపట్టిన న్యాయమూర్తి ఐదుగురికి రూ.6500 జరిమానా, ఒకరికి మూడు రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పును వెలువరించారని సీఐ తెలిపారు.

మృతుడి కుటుంబానికి రూ.5లక్షల చెక్కు పంపిణీ



రూ.5లక్షల విలువగల చెక్కు అందజేస్తున్న చేర్యాల ఏడీఈ వెంకటేశ్

చేర్యాల, మే 22 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం వీఎస్ఆర్ నగర్‌కు చెందిన జంగా బాబు నాలుగేళ్లక్రితం చేర్యాల మండలం వీరన్నపేట గ్రామశివారులో విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. ఈమేరకు కుటుంబసభ్యులు పరిహారంకోసం పలుమార్లు విద్యుత్ అధికారులు, ప్రజాప్రతినిధులను ఆశ్రయించినా ఫలితం లేదు. ఈవిషయమై మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు ఇటీవల భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎంపీ చామల విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియో మంజూరు చే యించారు. ఈమేరకు గురువారం చేర్యాల ఏడీఈ వెంకట్, ఏఈ కిరణ్‌కుమార్ మృతుడిభార్య జంగా కవితకు చెక్కును అందజేశారు. అనంతరం కొమ్ము నర్సింగరావు మాట్లాడుతూ ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వెంటనే స్పందించి పరిష్కరింపచేసి పెద్దదిక్కుగా మారాడని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు న్యాయం చేకూరుతుందన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

గజ్వేల్, మే 22 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని లక్ష్మీప్రసన్ననగర్ కాలనీలో ఓ ఇంట్లో పలువురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారు. ఈ సమాచారంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, గజ్వేల్ పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.29,800 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో, పట్టణాల్లో, ఇళ్లల్లో, ఫాంహౌజ్‌లలో జూదం, పేకాట ఇతర చట్ట వ్యతిరేఖమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే వెంటనే డయల్-100 లేదా 8712667445, 8712667446, 8712667447 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని తెలిపారు.

విహాన్‌రామ్‌కు కేంద్రమంత్రి అభినందన

ధూళిమిట్ట,మే22(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయంగా పర్వతారోహణ చేస్తూ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడు విహాన్‌రామ్. మండలంలోని రెడ్యానాయక్ తండాకు చెందిన జాటోత్ విహాన్‌రామ్(9) కేంద్రమంత్రి బండి సంజయ్‌ను కరీంనగర్‌లోని ఆయన కార్యాలయంలో కోచ్ మహిపాల్ రెడ్డి, తండ్రి తిరుపతినాయక్‌తో గురువారం కలిశారు. ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్, మెడల్‌ను మరోసారి బండి సంజయ్ చేతుల మీదుగా అందుకున్నాడు. ఈ సందర్భంగా బాలుడు విహాన్‌రామ్‌ను కేంద్రమంత్రి బండి సంజయ్ అభినందించారు.

వర్షానికి కూలిన ఇల్లు



చెల్లాపూర్‌లో వర్షానికి కూలిన ఇల్లు

దుబ్బాక, మే22(ఆంధ్రజ్యోతి): రెండురోజులుగా కురుస్తున్న వర్షానికి గురువారం దుబ్బాక మున్సిపల్ చెల్లాపూర్‌లో పెంకుటిళ్లు కూలి నిరుపేదలు నిరాశ్రయులు అయ్యారు. గ్రామానికి చెందిన గుండవెల్లిపోశయ్య, గుండవెల్లి ఈశ్వరవ్వలకు చెందిన పెంకుటిళ్లు రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు కూలిపోయింది. వారి కుటుంబాన్ని గ్రామ బీఆర్ఎస్ నాయకులు సంజీవరెడ్డి ఆర్థిక సహాయం అందించారు.

బిల్లుల మంజూరుపై హర్షం

చేర్యాల, మే 22(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం మంజూరు చేయడం పట్ల కాంగ్రెస్ పార్టీ కొమురవెల్లి మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ హర్షం వెలిబుచ్చారు. ఈసందర్భంగా గురువారం కొమురవెల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధుల పట్ల వివక్ష వహించి బిల్లులు మంజూరుచేయకుండా ప్రాణాలతో చెలగాటమాడిందన్నారు.

జోరుగా కలప అక్రమ రవాణా

రోజుకు వందల సంఖ్యలో నేలకొరుగుతున్న చెట్లు



చిన్నకోడూరు మండలం అనంతసాగర్ శివారులో నిల్వ చేసిన కలప

చిన్నకోడూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): అందరం మొక్కలు నాటుదాం.. వృక్ష సంపదను కాపాడుకుందాం అన్న నినాదం చెప్పుకొనేందుకు అన్నట్లుంది. పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఉద్దేశంతో ప్రభుత్వంకోట్లాది రూపాయాలు వెచ్చించి ప్రతి యేటా మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతుంటే, మరో వైపు కొందరు వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా యథేచ్ఛగా చెట్లు నరికి వాటిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాల్లో కలప అక్రమ రవాణా జోరుగా సాగుతుందనే ఆరోపణలున్నాయి. మండలంలో ఏడాది కాలంలో నాటుతున్న మొక్కల కంటే నేలకొరుగుతున్న చెట్లే ఎక్కువగా ఉంటున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వర్షాలు కురవకపోవడానికి కారణం చెట్ల నరికివేతే కారణమని చెపుతున్నప్పటికీ కొందరు వ్యాపారులు చట్టాలను తమ చుట్టాలుగా మార్చుకుని దందాను సాగిస్తున్నారు. ప్రస్తుతం పెట్రోల్‌తో పనిచేసే యంత్రాలు మార్కెట్‌లోకి రావడంతో చెట్ల నరికివేత సులువుగా మారిందని, ఇదంతా జరుగుతున్న అటవీశాఖ అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

రహస్య ప్రదేశాల్లో డంపింగ్

పొలం గట్ల వెంబడి, బీడు భూములు, గ్రామాల సమీపంలోని అటవీ ప్రాంతాల్లో చెట్లను కలప వ్యాపారులు యథేచ్ఛగా నరికేస్తు పట్టణాల్లోని టింబర్ డిపోలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. చెట్లు నరికేందుకు ఆన్‌లైన్‌లో చలాన్ నిబంధన ఉండటంతో కొంత మంది వ్యాపారులు నాలుగు, ఐదు చెట్లకు మాత్రమే చలాన్ తీసుకుని పదుల సంఖ్యలో చెట్లను నరికివేస్తు కలపగా మారుస్తున్నారు. నరికివేసిన కలపను గ్రామాల శివారులలోని రహస్య ప్రాంతాల్లో నిల్వ చేస్తె గుట్టు చప్పుడు కాకుండా బొలెరో, డీసీఎం, లారీల వంటి వాహనాల్లో జన సంచారం లేని సమయాల్లో, రాత్రి వేళల్లో పట్టణాలకు తరలిస్తున్నట్లు సమాచారం. అలాగే కలపగా పనికి రానివాటిని ఇటుక బట్టీలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

నామమాత్రపు జరిమానాల విధింపు

రోజుకు వందల సంఖ్యలో చెట్లు నేలకొరుగుతుండటంతో పచ్చదనం తగ్గిపోయి పర్యావరణ సమతుల్యతకు ముప్పు కలిగే పరిస్థితి ఏర్పడుతుందని ప్రకృతి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో పొద్దస్తమానం పని చేసిన కూలీలు కాస్త సేదా తీరడానికి చెట్లు కరువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడపాదడపా దాడులు చేస్తున్నా అటవీశాఖ అధికారులు నామమాత్రంగా జరిమానాలు విధిస్తుండటంతో వ్యాపారులు భయపడటం లేదని, యధావిధిగా తమ దందాను కొనసాగిస్తున్నారు. అటవీ చట్టాలు కఠినంగా ఉన్న అధికారులు వాటిని అమలు చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి.

రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్

● అకాల వర్షంతో అపార నష్టం ● ప్రభుత్వం ఆదుకోవాలన్న బీఆర్ఎస్



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి

తొగుట/దుబ్బాక/ గజ్వేల్, మే 22 (ఆంధ్రజ్యోతి): వరిధాన్యం కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంతో పాటు ఆయా గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం వారు బీఆర్ఎస్ నాయకులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గజ్వేల్ నియోజకవర్గంలో కేసీఆర్ సహకారంతో నిర్మించిన రిజర్వాయర్ల కారణంగా వేల క్వింటాళ్ల వరి ధాన్యం దిగుబడి వస్తుందని, ఆ పంటను కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఆగ్రహానికి గురికాకముందే వడగండ్లు, భారీ వర్షాలకు తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

తొగుటలో అకాల వర్షంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, తరుగు పేరుతో రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తొగుట కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ హరికృష్ణ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం తొగుట మండలంలోని గుడికందుల కాన్గల్, తుక్కాపూర్, రాంపూర్, తొగుట గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు.

దుబ్బాక మున్సిపల్ చెర్వాపూర్‌గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం దిశకమిటి జిల్లా సభ్యులు సుంకు ప్రవీణ్ సందర్శించారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించి, కొనుగోలును వెంటనే చేపట్టాలని అధికారులను కోరారు. రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వరస వర్షాలతో ధాన్యం తడుస్తుందన్నారు.

సిమెంటు రహదారులను ప్రారంభించిన శ్రీనివాస్‌రెడ్డి

మిరుదొడ్డి, మే22 (ఆంధ్రజ్యోతి): మిరుదొడ్డి మండలం కొండాపూర్‌లో ఎన్ఆర్‌జీఎస్ కింద ఐదు లక్షలతో ఏర్పాటు చేస్తున్న సిమెంటు రహదారి పనులను గురువారం దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. తమ ప్రభుత్వం గ్రామాలాభివృద్ధికి పాటుపడుతుందన్నారు.

మిరుదొడ్డి తహసీల్దార్‌గా శ్రీనివాస్‌రెడ్డి

మిరుదొడ్డి, మే22(ఆంధ్రజ్యోతి): మిరుదొడ్డి తహసీల్దార్‌గా శ్రీనివాస్‌రెడ్డిని నియమించారు. ఆయన గురువారం పదవీబాధ్యతలను స్వీకరించారు.

రెండోరోజు ఘనంగా ప్రతిష్ఠాపన వేడుకలు

చేర్యాల, మే 22 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం దానంపల్లి గ్రామంలోని దుర్గమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహం, శీతలాదేవి నాభిశిల ప్రతిష్ఠాపన వేడుకలు రెండవరోజైన గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దేవతామూర్తుల విగ్రహాలకు జలాధివాసం, పుష్పాదివాసం, తదితర పూజలు నిర్వహించారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు షురూ

సిద్దిపేట కల్చరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 27 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు అధికారులు. ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ సెకండ్ లాంగ్వేజ్ పరీక్షలను రెండు సెషన్‌లలో అధికారులు నిర్వహించారు.

రోడ్డెక్కిన రైతన్నలు



రోడ్డుపై బైఠాయించి ధర్నా రాస్తారోకో చేస్తున్న రైతన్నలు

తొగుట, మే 22 (ఆంధ్రజ్యోతి) : జీలుగ విత్తనాల కోసం రైతన్నలు రోడ్డెక్కి ధర్నా రాస్తారోకో చేసిన సంఘటన మండల కేంద్రమైన తొగుట రైతు వేదిక వద్ద గురువారం మధ్యాహ్నం జరిగింది. వివరాల్లోకి వెళితే... మండల కేంద్రానికి రెండు రోజులుగా జనుము , జీలుగా విత్తనాలు సబ్సిడీపై రైతులకు అందించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. కానీ విత్తనాలు తక్కువ రాగా రైతులు ఎక్కువ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. సబ్సిడీ జీలుగా విత్తనాలు అయిపోయినట్లు దుకాణ యజమానులు రైతులకు చెప్పడంతో ఆగ్రహంతో రోడ్డెక్కి ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతులు ఆందోళన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి అక్కడికి చేరుకుని వారికి మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోహిణి కార్తె వొస్తున్నా సకాలంలో జీలుగ, జనుము విత్తనాలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. మండలానికి 200 బస్తాల పచ్చి రొట్టె విత్తనాలు వస్తే రైతులకు ఏ మూలకు సరిపోతాయని ఆయన ప్రశ్నించారు. ముందస్తు సమాచారం లేకుండా విత్తనాలు పంపిణీ చేస్తున్నారని, చివరి గ్రామాల రైతులకు అందడం లేవన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.1100 వొచ్చే పచ్చి రొట్ట విత్తనాలను నేడు రూ.2138 వరకు పెంచడం రైతులపై భారం మోపడమే అవుతుందన్నారు. రెండు రోజుల్లో అందరికి విత్తనాలు అందిస్తామని ఆయన హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఘనంగా హనుమాన్ జయంతి



ఐదు రూపాయల నాణాలతో హనుమంతుడి చిత్రం

చేర్యాల/మద్దూరు/చిన్నకోడూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం జిల్లాలోని పలు మండలాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

నాణాలతో హనుమంతుని చిత్రం

హనుమాన్ జయంతి సందర్భంగా 5 రూపాల నాణాలు ఉపయోగించి హనుమాన్ ప్రతిరూపాన్ని అద్భుతంగా రూపొందించి గురువారం ఆవిష్కరించిన గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, కళాకారుడు రామకోటి రామరాజు.

నూతన వంగడాలతో అధిక దిగుబడి

జగదేవ్‌పూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన సాంకేతిక పద్ధతులను రైతులు అందిపుచ్చుకొని నూతన వంగడాలు సాగు చేసినట్లయితే అధిక దిగుబడులు పొందవచ్చని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవిలు సూచించారు. గురువారం జగదేవ్‌పూర్ మండలంలోని అలిరాజపేటలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు పరిశోధన ఫలితాలను అవగాహన కల్పించారు.

మార్కెట్ యార్డును సందర్శించిన డీఆర్డీఏ డీపీఎం

తొగుట, మే 22 (ఆంధ్రజ్యోతి): తొగుట మార్కెట్ యార్డును గురువారం సాయంత్రం డీఆర్డీఏ డీపీఎం కరుణాకర్ సందర్శించారు. రైతులతో మాట్లాడి కొనుగోళ్లు సక్రమంగా జరుగుతున్నాయా అడిగి తెలుసుకున్నారు.

ఆర్టీసీ డిపోను సందర్శించిన ఈడీ

హుస్నాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ ఆర్టీసీ డిపోను గురువారం సాయంత్రం కరీంనగర్ రీజియన్ ఈడీ సొల్మాన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన డిపో అభివృద్ధి కోసం చేపట్టిన టీమ్- 20 ఉద్యోగులతో మాట్లాడారు. డిపోలోని ముఖ్య కేటగిరీ నుంచి 20 మందిని ఎంపిక చేసుకొని వీరిని ఒక టీమ్‌గా ఏర్పాటు చేసి, ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ డిపో అభివృద్ధికి కృషి చేయడమే టీమ్ - 20 ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు తమ ఆరోగ్యం కాపాడుకుంటూ, ఎలాంటి యాక్సిడెంట్‌లు లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా ప్రయాణీకుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు.

ధాన్యం కొనుగోలులో రికార్డు

సిద్దిపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం రికార్డు సాధించిందని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ అన్నారు. గురువారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అత్తు ఇమామ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి నుంచి రైతుల పక్షాన నిలబడిన ప్రభుత్వమన్నారు. గతంలో కేసీఆర్ పాలనలో ధాన్యం కొనుగోలు చేయాలన్న, ధాన్యం డబ్బులు రైతుల బ్యాంకుల ఖాతాలో జమకావాలన్న రైతులు ఎదురుచూసేవారని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో అలాంటి ఎదురుచూపులకు తావు లేకుండా రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన తక్కువ రోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాలలో డబ్బులను జమ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డికి చెల్లుతుందని చెప్పారు.

మట్టిలో దిగబడ్డ ధాన్యం లారీ



బురదలో దిగబడ్డ లారీ

రాయపోల్, మే 22 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ కొనుగోలు కేంద్రం లారీలో ధాన్యం నింపుతున్న క్రమంలో ఆకస్మికంగా వర్షం వచ్చింది. లారీ చక్రాలు బురదలో దిగబడి పోగా లారీ ఓ వైపుకు వంగిపోయింది. ఎంత ప్రయత్నం చేసినా లారీ బయటకు రాలేదు. ఐకేపీ సిబ్బంది గురువారం ఉదయం లారీలోని ధాన్యం సంచులను కిందికి అన్‌లోడ్ చేయించారు. అనంతరం జేసీబీ సహాయంతో లారీని బయటకు తీశారు.

ధాన్యం వెంటనే తరలించాలి

సిద్దిపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశా) సభ్యులు రవీందర్‌రెడ్డి గురువారం రాయపోల్ ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోతున్నదని వెంటనే ధాన్యాన్ని తరలించాలని జిల్లా అధికారులకు ఫోన్ చేసి కోరారు. ఎంపీ రఘునందన్‌రావుకు ఫోన్ చేసి రైతుల సమస్యను వివరించి రైతులకు న్యాయం జరిగే విదంగా చూడాలని విజ్ఞప్తి చేశారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

సిద్దిపేట క్రైం /చిన్నకోడూరు /నంగునూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాధిక హెచ్చరించారు. గురువారం నంగునూరు లోని వివిధ ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. గురువారం చిన్నకోడూరులోని పలు విత్తన విక్రయ దుకాణాలను ప్రొబీషనరీ ఎస్సై సైఫ్ అలీ, ఏవో జయంత్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని సిద్దిపేట టూ టౌన్ సీఐ ఉపేందర్ హెచ్చరించారు. గురువారం ఆయన సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉన్న సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ షాప్ లో సిద్దిపేట అర్బన్ వ్యవసాయ అధికారి శ్రీనాథ్‌తో తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఇరువురు అధికారులు మాట్లాడుతూ స్టాక్ రిజిస్టర్, డెలివరీ రిజిస్టర్, బిల్ బుక్, తదితర రికార్డ్స్ తనిఖీ చేశారు.

రైతు సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నంగునూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తుందని మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య ,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సోమిరెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షులు లింగం గౌడ్ ఆరోపించారు. గురువారం నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, రైతుల భూములు సారవంతం అయ్యేందుకు పచ్చి రొట్టె విత్తనాలైనా జీలుగా జనుము పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. బీఆర్ఎస్ హయాంలో మండలానికి 1300 బస్తాలు జీలుగా, జనం ఇస్తే ఈసారి కేవలం 100 బస్తాలే పంపిణీ చేయడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తెచ్చినప్పటికీ కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ధాన్యాన్ని పట్టించుకోకపోవడం వల్ల అవి వానకు నానుతూ, ఎండకు ఎండుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

టీవీవీపీ బ్రాండింగ్ పథకానికి జిల్లా ఆసుపత్రి ఎంపిక

గజ్వేల్, మే 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వైద్య విధాన పరిషత్ బ్రాండింగ్ పథకానికి గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఎంపికైందని ఆసుపత్రి సూపరిండెంట్, డీసీహెచ్ఎస్ డాక్టర్ అన్నపూర్ణ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని ఆమెతో పాటు టీ జీఎంఐడీసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో అవసరమైన మౌలిక వసతులు, సుందరీకరణ, పార్కింగ్, ఓపీ, ఐపీ, బ్యూటిఫికేషన్, ఫైర్ సెఫ్టీ, గార్డెనింగ్ తదితర పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లలో అవినీతికి తావివ్వొద్దు

● సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

చేర్యాల, మే 22 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లలో అవినీతికి తావులేకుండా అర్హులకు అందించాలని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. కొమురవెల్లి మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో సీసీరోడ్ల నిర్మాణంలో కమీషన్లు వసూలు చేసి అవినీతికి పాల్పడ్డారని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో షరతులు విధించకూడదని, గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపికచేసి పారదర్శకత నిరూపించుకోవాలని అన్నారు. లేనియెడల ఆందోళనలు చేపడతామన్నారు.

రెండు పాఠశాలలకు నోటీసులు

చేర్యాల, మే 22 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్న రెండు పాఠశాలలకు విద్యాశాఖాధికారులు ఎట్టకేలకు నోటీసులు జారీచేశారు. ఈసందర్భంగా గురువారం ఆయా పాఠశాలల నోటీస్‌బోర్డులపై నోటీసులు ప్రదర్శించారు. ఓ పాఠశాలకు గుర్తింపులేదని, మరో పాఠశాలకు సీబీఎస్ఈ సిలబస్‌గానీ, ఇంటర్నేషనల్ స్కూల్స్ అనుమతులు ఏమాత్రంలేవని పేర్కొన్నారు. ఏమాత్రం తప్పుడు ప్రచారం చేసుకోకూడదని సూచించారు. ఆయా పాఠశాలలకు గుర్తింపులేని విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలంటూ ఎంఈవో కిష్టయ్య తెలిపారు.

కార్మికులకు బాసటగా రాష్ట్ర ప్రభుత్వం

సిద్దిపేట , మే 22 (ఆంధ్రజ్యోతి): సెస్ బోర్డు పరిధిలో అధిక నిధులు ఉన్న అధికారులు నిరుపయోకరంగా చేస్తున్నారని భవన నిర్మాణ రంగ కార్మికులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారి సంక్షేమం కోసం పని చేసేందుకు కృషి చేస్తానని భవన నిర్మాణ కార్మిక సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం అన్నారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్టంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి నిర్మాణ రంగ కార్మికులకు పథకాలను వర్తింపజేసే విధంగా చూడాలని తెలిపారు. పలుమార్లు గత ప్రభుత్వంలో విన్నవించుకున్న చలనం లేకుండా పోయిందని మండిపడ్డారు. భవన నిర్మాణ సమయంలో కార్మికులు ప్రమాదవశాత్తు గాయపడినా, అంగవైకల్యం సంభవించిన తక్షణమే ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.

ఏసీపీ పురుషోత్తంరెడ్డికి కమాండేషన్ సర్టిఫికెట్



రాష్ట్ర డీజీపీ, ఉన్నతాధికారులతో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

గజ్వేల్, మే 22 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ఏసీపీ కె. పురుషోత్తంరెడ్డికి కమాండేషన్ సర్టిఫికెట్ దక్కింది. రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ చేతుల మీదుగా గురువారం ఆయన సర్టిఫికేట్‌ను అందుకున్నారు. పటాన్‌చెరు డీఎస్పీగా పురుషోత్తంరెడ్డి పనిచేస్తున్న క్రమంలో సంగారెడ్డి జిల్లా బీడీఎల్ భానూరులో అత్యాచారం, హత్య, పోక్సో కేసులో నేరస్థుడికి ఉరిశిక్ష పడిన కే సులో ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా పని చేస్తూ కీలక ఆధారాలు సేకరించి, చార్జీషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సంగారెడ్డి సెషన్స్ కోర్టులో జరిగిన విచారణలో నేరస్తునిపై నేరం రుజువై మరణశిక్ష పడింది. ఈ కేసును పారదర్శకంగా విచారణ చేసినందుకు గానూ డీజీపీ చేతుల మీదుగా కమాండేషన్ సర్టిఫికేట్‌ను పొందారు. విషయం తెలుసుకున్న సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ ఏసీపీ పురుషోత్తంరెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు.

వల్లభాపూర్ 44వ జాతీయ రహదారిపై సర్వీస్ రోడ్

చేగుంట ,మే 22 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ మండలం వల్లభాపూర్ 44వ జాతీయ రహదారి మూలమలుపు వద్ద సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేస్తే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంటుందని ఎన్‌హెచ్ఏఐ అధికారులతో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి గురువారం మూలమలుపు వద్ద సర్వీస్ రోడ్ ఏర్పాటుకు కోసం పరిశీలించారు. మూలమలుపు వద్ద సర్వీస్ రోడ్డు లేకపోవడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని సుమారు 250 మీటర్ల నిడివి గల సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేస్తే ప్రమాదాల నివారణకు ఎంతో ఉపయోగపడుతుందని వెంటనే పనులు త్వరగా పూర్తి చేయాలని నేషనల్ హైవే అథారిటీ పీడీ శ్రీనివాసరావు, కు ఆదేశించారు. త్వరలోనే సర్వీస్ రోడ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పీడీ శ్రీనివాసరావు తెలిపారు.

భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు

సిద్దిపేట కలెక్టరేట్, మే22 (ఆంధ్రజ్యోతి): మ్యాదరి భాగ్య రెడ్డి వర్మ జయంతి సందర్భంగా జిల్లా గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ఆయన వర్మ 137 వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ మను చౌదరి, జిల్లా అదనపు కలెక్టర్లు గరిమ అగ్రవాల్, అబ్దుల్ హమీద్ లతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సమావేశంలో డీఆర్వో నాగరాజమ్మ, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో..

గజ్వేల్, మే 22(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సిద్దిపేట జిల్లా పీఎం జాన్‌షాహీద్ పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని 108, 102, 1962 ఎఫ్‌హెచ్ఎస్, నియోనాటల్ వాహనాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నందున ఎల్లప్పుడు అలర్ట్‌గా ఉండాలని, ప్రజలకు నాణ్యమైన సేవలను అందించడంలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. కాల్ వచ్చిన వెంటనే స్పందించి మెరుగైన వైద్య సేవలను అందించాలని సూచించారు.